క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వెంకటేశ్వరలో పీజీ ఓరియంటేషన్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన ఎంసీఏ, ఎంబీఏ కోర్సులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఇందులో బెంగళూరు ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ అనాలసిస్, అనిగి మీడియా ల్యాబ్ సీనియర్ మేనేజర్ సునీల్ కనకరాజులు ముఖ్యవక్తగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో రాణించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, ఎంసీఏ, ఎంబీఏ విభాగాధిపతులు నాగేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు (దర్గామిట్ట): జేసీ కూర్మనాథ్‌ను ఎమ్మెల్సీ మేరిగ మురళి కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామని జేసీ హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎం - 1 థియేటర్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై గురువారం చోటుచేసుకుంది. మృతుడు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగి ఆరెంజ్ రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, తెలుపు రంగు కట్ బనియన్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాల కోసం పరిసర ప్రాంతాల్లో ఆరాతీసినా ప్రయోజనం లభించలేదు.

విశాఖపట్నం పయనమైన జిల్లా ఇంజినీర్లు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు జిల్లా జలవనరుల శాఖ ఇంజినీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ కృష్ణమోహన్ మాట్లాడారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ నేతృత్వంలో భారత జాతీయ నీటిపారుదల కమిటీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నీటిపారుదల కమిషన్ సదస్సు ఈ నెల 8 వరకు జరగనుందని చెప్పారు. ఐడీఐడీ - ఐఎఫ్సీ నాయకత్వ ఆహ్వానం మేరకు జిల్లా ఇంజినీర్లు సదస్సులో పాల్గొనడం హర్షణీయమన్నారు.

ఘన నివాళి



నెల్లూరు(దర్గామిట్ట): మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి సతీమణి జక్కా సులోచనమ్మ ఉత్తరక్రియలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

స్వీట్‌కార్న్.. యమ టేస్టీ



రోడ్డు పక్కన జోరుగా స్వీట్‌కార్న్ విక్రయాలు



స్వీట్‌కార్న్

- జీవనోపాధిగా మారిన స్వీట్‌కార్న్ వ్యాపారం
- రోడ్డుకు ఇరువైపులా జోరుగా విక్రయాలు

కోవూరు : మన నిత్య జీవితంలో ఆరోగ్యానికి స్వీట్ కార్న్ ఎంతో ఉపయోగకరం. వీటిని ఉడకబెట్టుకుని తినవచ్చు.. పకోడ చేసుకోవచ్చు.. ఫ్రై చేసుకొని కర్రీగా కూడా వాడుతారు. ఆఖరికి సూప్‌గా చేసుకొని స్వీకరిస్తుంటారు. వర్షాకాలం, చలికాలం సమయాల్లో స్వీట్‌కార్న్ అందరినీ నోరు ఊరిస్తుంటాయి. ఇవి కేవలం రుచికర ఆహారమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకే ప్రస్తుతం కోవూరు పరిసర ప్రాంతాల్లో స్వీట్‌కార్న్ అమ్మకాలు జరుగా జరుగుతున్నాయి. ఇవి చిరు వ్యాపారులకు జీవనోపాధి అందిస్తుంది. నియోజకవర్గంలోని చిరు వ్యాపారులు స్వీట్‌కార్న్‌ను కొనుగోలు చేసుకొని జాతీయ రహదారికి ఇరువైపులా అమ్మకాలు చేపడుతున్నారు.

ధర తక్కువ పోషకాలు ఎక్కువ

స్వీట్‌కార్న్ బీటా కెరోటిన్ క్సాన్ థిన్స్, లూటైన్ లాంటి యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. విటమిన్ ఏ ఎక్కువగా ఉండటం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అంతేకాక ఇవి తింటే యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల కేన్సర్‌కు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను నివారిస్తాయి. ప్రధానంగా బ్రెస్ట్ లివర్ కేన్సర్‌కు చెక్ పెట్టడంలో వీటి పాత్ర ఎక్కువగా ఉంటాయి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండటం జీర్ణాశయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే వీటిని అధికంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందువల్లే ప్రస్తుతం స్వీట్‌కార్న్‌ను హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారంగా అందజేస్తున్నారు. విద్యార్థులకు కోడిగుడ్డుకు బదులుగా వీటిని ఇస్తున్నారు. స్వీట్‌కార్న్‌కు ప్రస్తుతం మార్కెట్‌లో గిరాకీ ఉంది. 80 నుంచి 90 రోజుల్లో చేతికి వచ్చే ఈ పంటను ఇసుక భూముల్లో అధికంగా సాగు చేస్తుంటారు. కోవూరు నియోజకవర్గం మొత్తం పెన్నా పరీవాహక ప్రాంతాలు కావడంతో స్వీట్‌కార్న్, మొక్కజొన్నను అధికంగా సాగు చేస్తున్నారు. వీటిలో స్వీట్‌కార్న్‌కు అధిక డిమాండ్ ఉంది. రైతుల వద్ద నుంచి ఎకరం తోటను లక్ష నుంచి రూ.1.50 వరకు కొనుగోలు చేస్తుంటారు.

ప్రయాణికులను ఆకర్షిస్తూ

రోడ్డు మార్గాన వెళ్లే కార్లు, బైక్‌లను ఆకర్షించేలా రహదారులపై పలుచోట్ల చిరువ్యాపారులు స్వీట్‌కార్న్ విక్రయాలను సాగిస్తున్నారు. నెల్లూరు–కావలి జాతీయ రహదారిపై, నెల్లూరు– ముంబై జాతీయ రహదారితో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ స్వీట్‌కార్న్ వ్యాపారం జోరుగా ఉంది. ప్రధానంగా ప్రయాణాల సమయంలో వీటిని అధికంగా తీసుకుంటారు. వీటి ధర రూ.10 నుంచి రూ.25 వరకు ఉంటుంది. దీంతో ప్రజలు అధికంగా వీటిని కొనుగోలు చేస్తున్నారు.

వెంటనే విక్రయించాలి

మొక్కజొన్న కోసిన తరువాత నిల్వ ఉంటుంది. కానీ స్వీట్‌కార్న్, బేబీకార్న్ వంటివి నిల్వకు పనికిరావు. కోసిన రెండు రోజుల్లో విక్రయిస్తే లాభాలు వస్తాయి. లేకపోతే నష్టపోవాల్సి వస్తోంది. స్వీట్‌కార్న్‌కు ఇటీవల కాలంలో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. రైతులు, వ్యాపారులు కలిసి వీటిని సాగు చేస్తుంటారు.

– ఏఓ ఇందిరావతి, కోవూరు

అవినీతి రహిత సమాజమే ధ్యేయం



ప్రతిజ్ఞ చేస్తున్న జెన్‌కో సెక్యూరిటీ ఉద్యోగులు



మాట్లాడుతున్న సీఈ సుధీర్‌బాబు

ముత్తుకూరు : అవినీతి రహిత సమాజమే ధ్యేయంగా పనిచేయాలని నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టు సీఈ (ఓ అండ్ ఎం) కె.సుధీర్‌బాబు అన్నారు. ఏపీ ఎనర్జీ స్పెషల్ సీఎస్, ఎండీ ఆదేశాల మేరకు జెన్‌కో ప్రాజెక్టు పాలనా భవనం వద్ద గురువారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'సే నో టుది కరప్షన్-కమిట్ టు ది నేషన్' అనే నినాదంతో నిర్వహించిన సమావేశంలో సీఈ మాట్లాడారు. అవినీతి రహిత భారతదేశం, ఉద్యోగుల పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. అవినీతికి దూరంగా ఉంటామనే అంశంపై ఉద్యోగులు, సెక్యూరిటీతో ప్రతిజ్ఞ చేయించారు. విజిలెన్స్–సెక్యూరిటీ డీఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యను పరిష్కరించాలి

కోవూరు : హమాలీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఇనమడుగు సెంటర్ నుంచి కోవూరు బజార్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యపై యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే పనులను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నేతలు పి.సూర్యనారాయణ, సీహెచ్ దామోదర్‌రెడ్డి, రామ్‌బాబు, సుధాకర్, ఆవాజ్ నేతలు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



హమాలీలకు సంఘీభావంగా ర్యాలీ చేస్తున్న వామపక్ష నేతలు

వైభవంగా ఉత్సవ విగ్రహ ప్రతిష్ట

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. పట్టణంలోని గేటుసెంటర్‌కు చెందిన నాగసూరి–రజనీ దంపతులు ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా 2 నుంచి 4వ తేదీ సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు వెల్లడించారు. తొలిరోజు భగవత్ ప్రార్థన, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, మృత్ సంగ్రహణం, అంకురారోహణ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, రాత్రి శయ్యాధివాసం గావించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడలపై ఆసక్తి చూపాలి



ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

- వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో బాస్కెట్ బాల్ విభాగంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల(కావలి) ప్రథమ స్థానంలో, విక్రమసింహపురి యూనివర్సిటీ కళాశాల(కావలి) ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే సాఫ్ట్‌బాల్ విభాగంలో డాక్టర్ ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల(ఆత్మకూరు), ద్వితీయ స్థానంలో రావూస్ డిగ్రీ కళాశాల(నెల్లూరు) నిలిచింది. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన టీమ్ సభ్యులను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటుగా, క్రీడలు, ఇతర సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచాలని తెలియజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృడత్వాన్ని కలిగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

పొదలకూరు : మండలంలోని వరదాపురంలో ఉన్న ప్రైవేటు స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆల్తుర్తి గ్రామానికి చెందిన విద్యార్థి నందకిశోర్ ఆచూకీ గురువారం లభ్యమైంది. మంగళవారం గల్లంతైన బాలుడు పెంచలకోనలో తిరుగుతుండగా తెలిసిన వారు తండ్రి పిచ్చయ్యకు సమాచారం అందించారు. దీంతో ఆయన నందకిశోర్ వద్దకు వెళ్లి ఇంటికి తీసుకొచ్చారు. కాగా విద్యార్థి అదృశ్యంపై తండ్రి పిచ్చయ్య బుధవారం పొదలకూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ లభ్యం కావడంతో అటు కుటుంబ సభ్యులు, ఇటు పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

8 నుంచి సౌతిండియా వాలీబాల్ టోర్నీ

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముత్తుకూరులోని ఈఆర్ఆర్ఎం క్లబ్‌లో ఈనెల 8వ తేదీ నుంచి సౌతిండియా ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి జాతీయ, అంతర్జాతీయ జట్లు పాల్గొంటాయని తెలియజేశారు. ఎనిమిది పురుషుల జట్లు, నాలుగు మహిళా జట్లు పాల్గొనే ఈ టోర్నీ 11వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. పురుషుల జట్లలో ప్రథమ బహుమతిగా రూ.లక్షతో పాటు ఐదు బహుమతులు, మహిళల జట్లలో ప్రథమ బహుమతిగా రూ.50.000లతో పాటు మరో మూడు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.

'జిల్లా అభివృద్ధిలో గౌతమ్‌రెడ్డిది కీలకపాత్ర'

నెల్లూరు(మినీబైపాస్) : జిల్లా అభివృద్ధిలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని ఎఫ్ఎస్ఎంఈ జాతీయ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు.

నాస్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి




మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

మనుబోలు : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్ఏఎస్) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాస్ పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్‌లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు, ఆరు, తొమ్మిదో తరగతుల విద్యార్థుల్లో వారి సామర్థ్యాన్ని లెక్కించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలో మొత్తం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలియజేశారు. వెంకటాచలం మండలానికి చెందిన బీ ఫార్మసీ విద్యార్థులను ఈ పరీక్షలకు ఇన్వెస్టిగేటర్లుగా నియమించామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఈఓ రమేష్, సీఆర్‌టీలు చెంచురామయ్య, స్వరూప, శ్రీనివాసులు, జయరామయ్య ఉన్నారు.

తీవ్ర వివాదాస్పదంగా సర్వేయర్ తీరు

- సొంతూరిలో దుకాణం తెరిచిన వైనం
- డిప్యుటేషన్‌పై పంపినా ఇష్టారాజ్యంగా భూ పత్రాల జారీ
- పలు సమస్యలకు దారితీస్తున్న సర్వేయర్ వ్యవహారశైలి



విజయ్‌కుమార్ జారీ చేసిన పత్రం

ఇందుకూరుపేట : మండలంలోని ఓ సచివాలయ సర్వేయర్ వ్యవహారం తీవ్ర వివాదాస్పదమవుతోంది. తన హోదాను దుర్వినియోగం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. మైపాడుకు చెందిన తుమ్మల విజయ్‌కుమార్ సచివాలయ సర్వేయర్‌గా ఉద్యోగం పొంది సొంతూరు మైపాడులోనే కొలువు తీరాడు. తమ ఊరికి చెందిన యువకుడు సర్వేయర్ కావడంతో భూ సంబంధిత విషయాల్లో ఇబ్బందులు ఉండబోవని స్థానికులు భావించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ సర్వేయర్ భూ వివాదాలకు తెరలేపుతున్నారు. ఈయన నిర్వాకం చూసిన ఉద్యోగులు, ప్రజలు విస్తుపోతున్నారు. తన దగ్గరకు వచ్చిన వారికి సమస్యను బూచిగ చూపుతూ తోచిన ధరను నిర్ణయించి నగదు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సర్వేయర్ వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు అందుకున్న ఆఫీసర్లు స్పందించి వెంటనే సర్వేయర్‌ను డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కు సాగనంపారు. అయినా అతని చేతివాటం చూపడంలో మాత్రం వెనక్కి తగ్గలేదు. మైపాడు సచివాలయ సర్వేయర్ నేనే అంటూ భూ హక్కుదారులకు పత్రాలను జారీ చేస్తూ అందిన వరకు దండుకోవడం కొనసాగిస్తున్నాడు. ప్రధానంగా స్థానికుడు కావడంతో ప్రజల భూ సమస్యలను ముందుగానే తెలుసుకుంటున్నాడు. అందుకు తగ్గట్లుగా వారి దగ్గర నగదు వసూలు చేయడం పరిపాటిగా మార్చుకున్నాడు. ఇలా ఓ రైతు పొలాలకు సంబంధించి సమస్య ఉందని చెప్పి ఆయన వద్ద సగం ధరకు ఆ పొలాన్ని కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిప్యుటేషన్‌పై వెళ్లిన తరువాత కూడా జారీ పత్రాలు మంజూరు చేయడం సర్వేయర్ బరితెగింపునకు నిదర్శనంగా మారింది. సర్వేయర్ నిర్వాహకం వల్ల పలువురు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కుటుంబాల మధ్య వివాదాలు చెలరేగేలా ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన నీకు ఇక్కడ పనేంటని ప్రశ్నించిన అధికారులు, నాయకులపై సైతం బెదిరింపులకు దిగుతున్నాడు. ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్న సచివాలయ సర్వేయర్ విజయ్ కుమార్‌పై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని మైపాడు వాసులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ కె.నాగేంద్రబాబును వివరణ కోరగా సర్వేయర్ విజయ్‌కుమార్ రెండు నెలల క్రితం డిప్యుటేషన్‌పై వెళ్లి ఉన్నాడని, మైపాడు సచివాలయ పరిధిలో ఎటువంటి అధికారాలు లేవని పేర్కొన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు



రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ

నెల్లూరు(దర్గామిట్ట) : స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని, అందుకు రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని జేసీ రోణంకి కూర్మనాథ్ కోరారు. ఓటర్ల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను గత నెల 27న ప్రచురించినట్లు తెలిపారు. అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5న ప్రచురించనున్నట్లు చెప్పారు. అలాగా 18 ఏళ్లు నిండే అర్హులైన వారందరిని ఓటర్లుగా చేర్పించాలని కోరారు. ఈ నెల 4, 5, డిసెంబరు 13న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు మందల వెంకటశేషయ్య (వైఎస్సార్‌సీపీ), చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ (టీడీపీ) పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఎన్నికల అధికారి, ప్రొఫెసర్ గోవిందు పేర్కొన్నారు. ప్రెసిడెంట్‌గా డాక్టర్ నరేంద్ర, జనరల్ సెక్రటరీగా డాక్టర్ మహేష్, కోశాధికారిగా డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌ను కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు.



కొమ్మరపూడిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్ : హిందూ ధర్మప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని కొమ్మరపూడిలో విశేష పూజలను వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సుదర్శన హోమం, కుంకుమార్చన, కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు తలంబ్రాలు, గాజులను అందజేశారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు

- నువ్వు, పెసర సాగును పరిగణించాలి
- ఏఓ వాసు





పెసర పంట

పొదలకూరు : వర్షపాతం నమోదయ్యే వరకు రైతులు వరిసాగు చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, దీంతో ముందస్తుగా ప్రత్యామ్నాయ వర్షాధార పంటల సాగును చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి ఎ.వాసు సూచించారు. ఈ మేరకు ఏఓ మాట్లాడుతూ నువ్వు, పెసర పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. సోమశిలలో తగినంత నీటినిల్వ సామర్థ్యం లేనందున వర్షాధారంగా రైతులు వరినాట్లు పోసుకోవద్దని సూచించారు. నువ్వు, పెసర పంటలు నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ చివరి వారం వరకు విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం ఉందన్నారు. నవ్వు పంట డిసెంబర్ చివరి వారం వరకు విత్తుకోవచ్చని చెప్పారు.

మెట్టపొలాల సాగు

మెట్టపొలాల్లో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు నువ్వు, ఉలవ పంటల సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని ఏఓ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మెట్టపంటల సాగు చేసి ఫలసాయం పొందాల్సిందిగా సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ నవ్వు సాగు చేసుకోవాలని తెలిపారు.

తక్షణం రైతులు చేయాల్సి పనులు

పదును వర్షం కురిస్తే రైతులు వెంటనే దుక్కిదున్నకం పనులు చేపట్టాల్సిందిగా ఏఓ సూచించారు. తర్వాత కురిసే వర్షాలకు ముందు సూచించిన పంటలను విత్తుకుంటే వరికి ప్రత్యామ్నాయంగా రైతులు ఫలసాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మెట్టపంటల సాగులో భాగంగా విత్తనాలను విత్తుకోవచ్చని చెప్పారు. విత్తనం విత్తిన తర్వాత వర్షం కురిస్తే ఏపుగా పెరిగి అధిక దిగుబడి సాధించేందుకు వీలు ఉంటుందన్నారు.